# హనుమంతుడి నవ్వు

హనుమంతుడు నవ్వేడు. సభా మర్యాద పాటించక పకాలున నవ్వేడు. సభాసదులందరూ అదిరిపడ్డారు.

శ్రీరాముడు కొలువుతీరి వున్నాడు. సభలో వసిష్ఠుడు, రాముని సోదరులు, బంధువులు, హితులు, మంత్రులు, సామంతులు, విభీషణుడు, జాంబవంతుడు, సుగ్రీవుడు, పురప్రముఖులు ఉన్నారు.

వసిష్ఠుడు లేచి నిశ్శబ్దముగా ఉండమని చేతితో సంజ్ఞ చేసి శ్రీరాముడు తలపెట్టిన అశ్వమేధయాగ ముహూర్తం తెలియజేసేడు. సభాసదులు హర్షం వెల్లడించేరు. అయితే శ్రీరాముని చెంతనే వున్న హనుమంతుడు పకాలున నవ్వేడు. హనుమంతుడి నవ్వు ఓ కోతిచేష్టగా ఎవరూ భావించలేదు. వసిష్ఠుడి వదనం చిన్నబోయింది.

"సకల విద్యాప్రవీణుడు, నవవ్యాకరణ పండితుడైన వాయునందనుడు ఊరకనే నవ్వడు! నేను నిర్ణయించిన ముహూర్తంలో ఏదో లోపం వుందని నవ్వేడా? లేక లోగడ దశరథ మహారాజు కోరికపై శ్రీరామునికి యువరాజ్య పట్టాభిషేకముహూర్తం నిర్ణయిస్తే రాముడు అడవుల పాలుకావడం, దశరథ మహారాజు మృతి చెందడం జరిగింది. మరి ఈ మారు మరలా నేను నిర్ణయించిన ముహూర్తాన ఏవిపరీతం జరుగనున్నదో? అని నన్ను పరిహసిస్తూ హనుమంతుడు నవ్వి వుంటాడు!" అనుకున్నాడు వసిష్ఠుడు.

"ఎంతో శ్రమపడి లంకలో రావణుడి చెరలో వున్న జానకి జాడ తెలుసుకొని వచ్చి చెప్పకుంటే ఏమయి వుండేదో? అని నవ్వేడా? లేక సీత పతివ్రత అని అగ్నిహోత్రుడు రుజువు చేసినా ఒక పామరుని మతిలేని మాటలకు విలువిచ్చి నిండు చూలాలిని అడవులపాలు చేసి ఈ నాడు అశ్వమేధ యాగానికి సిద్ధపడ్డంచూసి నన్ను హేళన చెయ్యాలని నవ్వేడా?" అని

రాముడు మథనపడ్డాడు.

"అలనాడు యుద్ధభూమిలో మూర్ఛపోయినప్పుడు సూర్యోదయం లోపల తాను సంజీవి తేకుంటే ఈ లక్ష్మణుడి గతి ఏమయివుండేదో?" అని నన్ను చూసి హనుమంతుడు నవ్వి వుంటాడు!" అనుకున్నాడు సౌమిత్రి.

"పదునాలుగు సంవత్సరాల వనవాసం పూర్తయిన మరుచటి రోజున రాముడు అయోధ్యలో అడుగుపెట్టకుంటే ప్రాణత్యాగం చేస్తానని ప్రతిజ్ఞ చేసేను! అయితే పదునాలుగు వత్సరాలు నిద్రాహారాలు లేనివాని చేతిలో కాని ఇంద్రజిత్తు మరణించడు! సౌమిత్రి అన్నగారి సేవలో పదునాలుగు ఏళ్లు నిద్రాహారాలు విడిచి ఉన్నందున ఇంద్రజిత్తుని చంపగలిగేడు. ఇంద్రజిత్తు మరణించేక కొద్దిరోజులు యుద్ధం జరిగింది! రావణవధ, విభీషణుడి పట్టాభిషేకం అనంతరమే మరి రాముడు అయోధ్యకు వచ్చేడు కదా! ఈ భరతుడి ప్రతిజ్ఞ ఏమైందని? నన్ను హేళన చెయ్యడానికే హనుమంతుడు నవ్వేడు" అనుకున్నాడు భరతుడు.

"ఇంటిగుట్టు లంకకు చేటు అయింది! మా అన్న రావణుడి మరణ రహస్యం రాముడికి చెప్పడంవల్లే రాక్షస వీరులు, బంధువులు, లంకాపట్నం నాశనమైంది! అని నన్ను పరిహసించేందుకే ఆంజనేయుడు నన్నుచూసి నవ్వేడు!" అనుకున్నాడు విభీషణుడు.

"వరబలుడైన రావణుడు ముల్లోకాలు జయించి కార్తవీర్యార్జునుని రాజధాని మాహిష్మతీపురంపై దండెత్తి వెళ్లేడు. కార్తవీర్యార్జునుడు యుద్ధంలో రావణుడిని ఓడించి చెరసాలలో వేస్తే పులస్త్యుడు వచ్చి కార్తవీర్యుని బ్రతిమాలి రావణుడిని చెరసాల నుండి విడిపించేడు. అంతటి బలపరాక్రమవంతుడిని పరశురాముడు యుద్ధంలో సంహరించేడు. అంతేగాక 21 మార్లు రాజులపై దండెత్తి వారిని సంహరించిన పరశురాముడినే నిర్వీర్యుడిగా చేసిన ఘనుడు రఘురాముడు నేడు అశ్వమేధయాగం చెయ్యడమెందుకు?! అని సకల శాస్త్రకోవిదుడైన మారుతి నవ్వేడు!" అనుకున్నాడు జాంబవంతుడు.

ఈ విధంగా సభలోని వారు ఏదో కారణంతో ఎవరికివారే తమను పరిహసించేందుకే మారుతి నవ్వేడనుకుంటున్నారు.

సుగ్రీవుడు వెంటనే తేరుకొని "హనుమా! సభా మర్యాద పాటించక ఏమిటానవ్వు? నీ నవ్వుకు కారణం చెప్పు?" అని గద్దించేడు.

"చెప్పకూడదు! చెప్పలేను క్షమించాలి!" అన్నాడు మారుతి.

"చెప్పి తీరాలి ఇది సుగ్రీవాజ్ఞ!" అన్నాడు కోపంతో సుగ్రీవుడు.

"మరేం లేదు లోగడ నేను బాల్యచాపల్యంతో ఉదయిస్తున్న సూర్యుడిని చూసి పండనే భ్రమతో పట్టుకోబోతే నా మూతి పచ్చడయి ఈ రూపం వచ్చింది. మరి రాములువారు బాల్యంలో 'చందమామ' కావాలని మారాంచేస్తే కౌసల్యాదేవి అద్దంలో చంద్రుడి ప్రతిబింబం చూపించి రాములవారిని ఊరడించేరు. అలా కాక రాములువారు కూడ నావలె తొందరపడి వుంటే రాములవారి మూతి కూడా నామూతివలే వుండేది కాబోలు! అనే చిలిపి ఊహకు నవ్వు వచ్చింది!" అన్నాడు హనుమంతుడు.

(ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూలై 1999) ✪